సాక్షి
వైఎస్సార్ జిల్లా
మంగళవారం । 9 । మే । 2023



లోన్ యాప్ మోసగాళ్లు అరెస్ట్
వైఎస్సార్ జిల్లాలో లోన్ యాప్ మోసగాళ్లు ఇద్దరిని అరెస్టు చేసినట్లు ఎస్పీ అన్బురాజన్ తెలిపారు. వారి వద్ద నుంచి రెండు మొబైల్ ఫోన్‌లను సీజ్ చే - 8లో



వారంరోజుల్లో పెళ్లి..అంతలోనే హత్య
మరో వారం రోజుల్లో ఓ యువకుడు పెళ్లి చేసుకొని కొత్త జీవితంలోకి అడుగుపెట్టబోతున్నాడు. ఇంతలోపే స్వయానా తమ్ముడి చేతిలోనే దారుణంగా హత్యకు గురయ్యాడు. - 8లో



వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరి మృతి
ప్రొద్దుటూరు రూరల్ పరిధిలో వేర్వేరు ప్రాంతాల్లో జరిగిన రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు మృతి చెందారు. వారిలో ఒకరు మాజీ కౌన్సిలర్ ఉన్నారు. - 8లో

న్యూస్‌రీల్

19న జెడ్పీ సర్వసభ్య సమావేశం

కడప సెవెన్‌రోడ్స్ : జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం ఈనెల 19వ తేదీ ఉదయం 9.00 గంటలకు జెడ్పీ సమావేశ మందిరంలో జరుగుతుందని ముఖ్య కార్యనిర్వాహణాధికారి ఎం.సుధాకర్‌రెడ్డి తెలిపారు. జెడ్పీటీసీలు, ఎంపీపీలు, ఇన్‌చార్జి మంత్రి, పార్లమెంటు సభ్యులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, జిల్లా స్థాయి అధికారులంతా ఈ సమావేశానికి హాజరు కావాలని కోరారు. జిల్లా అధికారులు తమతమ శాఖల్లో జరుగుతున్న అభివృద్ధికి సంబంధించిన నివేదికలను తీసుకు రావాలని సూచించారు.

నేటి నుంచి ఫెయిలైనవారికి తరగతులు

కడప ఎడ్యుకేషన్ : జిల్లావ్యాప్తంగా 10వ తరగతిలో ఫెయిల్ అయిన విద్యార్థులకు ఆయా సబ్జెక్టు టీచర్స్ మంగళవారం నుంచి రెమిడియల్ క్లాసులను సప్లిమెంటరీ పరీక్షలకు ముందు రోజు వరకు నిర్వహించాలని డీఈఓ రాఘవరెడ్డి తెలిపారు. ప్రతి రోజు విద్యార్థుల హాజరును ఆయా పాఠశాలల హెడ్‌లు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. జూన్ 2వ తేదీ నుంచి 10వ తేదీ వరకు సప్లిమెంటరీ పరీక్షలుంటాయని తెలిపారు.

ఎస్‌ఏల నుంచి దరఖాస్తుల ఆహ్వానం

కడప ఎడ్యుకేషన్ : వైఎస్సార్ ఉమ్మడి కడప జిల్లాలోని హైస్కూల్ ప్లస్ పాఠశాలల్లో మంజూరైన 92 పీజీటీ పోస్టులకు సబ్జెక్టు బోధించుటకు అర్హత, ఆసక్తిగల స్కూల్ అసిస్టెంట్లు దరఖాస్తు చేసుకోవాలని డీఈఓ రాఘవరెడ్డి సోమవారం తెలిపారు. దరఖాస్తును www.kadapadoe.in వెబ్‌సైట్‌లో పొందుపరచాలని తెలిపారు. అలాగే నిర్ణీత ప్రొఫార్మాలో అర్హత ధ్రువపత్రాలు జతచేసి 9వ తేదీ బుధవారం ఉదయం 10 గంటలకు డీఈఓ కార్యాలయంలో అందచేయాలన్నారు.

గడువు పొడిగింపు

వైవీయూ : యోగివేమన విశ్వవిద్యాలయంలో కూచిపూడి నృత్యం, కర్ణాటక సంగీతం, కీబోర్డు సర్టిఫికెట్ కోర్సుల్లో ప్రవేశాల కోసం దరఖాస్తు గడువును ఈ నెల 18వ తేదీ వరకు పొడిగిస్తున్నట్లు వైవీయూ ప్రవేశాల సంచాలకులు ఆచార్య కంకణాల గంగయ్య తెలిపారు. ఈ కోర్సుల్లో ప్రవేశాలకు 10 సంవత్సరాలు నిండిన వారెవరైనా అర్హులన్నారు. తరగతులు కడప నగరంలోని శ్రీహరి డిగ్రీ కళాశాలలో ప్రతిరోజూ సాయంత్రం 5 నుంచి 7 గంటల వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు. కోర్సుకు సంబంధించిన వివరాలకు యోగివేమనయూనివర్సిటీ.ఏసీ.ఇన్ వెబ్‌సైట్‌లో కానీ, 9032595101 నంబరులో కానీ సంప్రదించాలని సూచించారు.

'మను'లో అడ్మిషన్లు ప్రారంభం

కడప ఎడ్యుకేషన్ : కడప రిమ్స్ వద్ద గల మౌలానా ఆజాద్ నేషనల్ ఉర్దూ యూనివర్సిటీ పాలిటెక్నిక్ కళాశాల(మను)లో అడ్మిషన్లు ప్రారంభమైనట్లు ప్రిన్సిపాల్ అబ్దుల్ ముక్సిత్‌ఖాన్ తెలిపారు. విద్యార్థులు మే 28 వరకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. వివరాలకు మను కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ మొహమ్మద్ సికిందర్ హుస్సేన్ (9398083058)ను సంప్రదించాలన్నారు.

ఖరీఫ్ పంట.. ప్రణాళిక ఖరారు

- జిల్లాకు 2950 క్వింటాళ్ల వేరుశనగ, 5334 క్వింటాళ్ల పచ్చిరొట్ట విత్తనాలు
- 64,150 మెట్రిక్ టన్నుల ఎరువులు కేటాయింపు
- 50 శాతం సబ్సిడీతో పచ్చిరొట్ట విత్తనాలు, 40 శాతం సబ్సిడీతో వేరుశనక్కాయలు
- ఈనెల 15 నుంచి పచ్చిరొట్ట విత్తనాల పంపిణీ ప్రారంభం
- జిల్లాలో ప్రస్తుతం అందుబాటులో 16981 మెట్రిక్ టన్నుల ఎరువులు



ప్రొద్దుటూరులోని గోడౌన్‌లో సిద్ధంగా పచ్చిరొట్ట విత్తనాలు

జిల్లా సమాచారం

ఎరువులు	కేటాయింపు (మెట్రిక్ టన్నుల్లో)	
యూరియా	12162.18	
డీఏపీ	5753.06	
ఎంఓపీ	2669.99	
ఎస్ఎస్‌పీ	3106.09	
కాంప్లెక్స్	34377.04	
ఇతరములు	918.89	
మొత్తం	64,150.44	
విత్తనాలు	**కేటాయింపు (క్వింటాళ్లు)**	**సబ్సిడీ**
జీలుగలు	4781	50 శాతం
జనుములు	383	50 శాతం
పిల్లిపెసలు	170	50 శాతం
వేరుశనగ(నారాయణి)	2000	40 శాతం
వేరుశనగ(కే6)	960	40 శాతం

కడప అగ్రికల్చర్ : రాష్ట్ర ప్రభుత్వం అన్నదాతలకు అడుగడుగునా అండగా నిలుస్తోంది, వ్యవసాయానికి రైతులకు తోడుగా నిలుస్తూ పంటల సాగుకు సాయంగా రైతు భరోసాను అందిస్తూ ఆదుకుంటోంది. దీంతోపాటు విత్తనం మొదలు పంట దిగుబడుల విక్రయం వరకు అండగా ఉంటోంది. అలాగే పంటల సాగుకు అవసరమైన అన్ని రకాల సేవలను ఉన్న ఊర్లోనే రైతు భరోసా కేంద్రాల ద్వారా అందిస్తూ వస్తోంది. ఇందులో భాగంగా ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో రైతుల పంటల సాగుకు అవసరమైన ఎరువులతోపాటు వేరుశనగ, పచ్చిరొట్ట విత్తనాలు ముందస్తుగా కేటాయించింది. ఇందులో వేరుశనగ, పచ్చిరొట్ట విత్తనాలను సబ్సిడీతో అందించనుంది. అలాగే వేరుశనక్కాయలను 40 శాతం సబ్సిడీతో ఇవ్వనుండగా పచ్చిరొట్ట విత్తనాలైన జీలుగలు, జనుములు, పిల్లిపెసలను మాత్రం 50 శాతం సబ్సిడీతో ఏపీ సీడ్స్ ద్వారా రైతులకు అందించనున్నారు.

ఖరీఫ్‌కు కేటాయించిన ఎరువుల వివరాలు ఇలా..

ఖరీఫ్ సీజన్‌లో జిల్లాకు 64,150.44 మెట్రిక్ టన్నుల ఎరువులు అవసరంగా గుర్తించి కేటాయించారు. ఆయా ప్రాంతాల్లో సాగును బట్టి రైతులు ఏ మేరకు ఏయే పంటను సాగు చేస్తారు. అందుకు ఏ రకమైన ఎరువులు అవసరమో గుర్తించి ఆ మేరకు ఆయా రైతు భరోసా కేంద్రంలో సంబంధిత ఎరువులను అందుబాటులో ఉంచనున్నారు. దీంతో రైతులకు ఎరువుల గురించిన ఆలోచనే ఉండకుండా ప్రభుత్వం చేస్తోంది. గతంలో రైతన్నలు పంటల సాగుకు ముందు వేరే ప్రాంతాలకు వెళ్లి వ్యయప్రయాసలు పడి ఎరువులను తెచ్చుకుని పెట్టుకోవాల్సిన పరిస్థితి నెలకొనేది. ఇప్పుడు ఆ కష్టాలకు స్వస్తి చెప్పి ఉన్న ఊరిలోనే అన్ని సేవలు అందడంపై అన్నదాతలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

కేటాయింపు ఇలా..

ఖరీఫ్ సీజన్‌కు 12,162.18 మెట్రిక్ టన్నుల యూరియా, 5763.06 మెట్రిక్ టన్నుల డీఏపీ, 2669.99 మెట్రిక్ టన్నుల మ్యూరేట్ ఆఫ్ పొటాష్, 3106.9 మెట్రిక్ టన్నుల సింగిల్ సూపర్ పాస్పేట్, 43,377.04 మెట్రిక్ టన్నుల కాంప్లెక్స్, 918 మెట్రిక్ టన్నుల ఇతర ఎరువులను ప్రభుత్వం కేటాయించింది.

అందుబాటులో 16,981 మెట్రిక్ టన్నుల ఎరువులు

జిల్లాలో ప్రస్తుతం 16,981 మెట్రిక్ టన్నుల ఎరువులు అందుబాటులో ఉన్నాయి. ఇందులో 865 మెట్రిక్ టన్నుల ఎరువులు రైతు భరోసా కేంద్రాల్లో ఉండగా మిగతా ఎరువులు మార్క్‌ఫెడ్‌తోపాటు ప్రైవేటు డీలర్స్ వద్ద ఉన్నాయి. ఎరువుల గురించి రైతులకు ఎలాంటి ఆందోళన లేకుండా ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటోంది.

జిల్లాకు మంజూరైన సబ్సిడీ విత్తనాల వివరాలు

జిల్లాకు సంబంధించి ఖరీఫ్ సీజన్‌కు జీలుగలు 4781 క్వింటాళ్లు, జనుములు 383 క్వింటాళ్లు, పిల్లిపెసలు 170 క్వింటాళ్లు మంజూరయ్యాయి. అలాగే వేరుశనక్కాయలు జిల్లాకు 2950 క్వింటాళ్లు మంజూరు చేయగా ఇందులో కే6 రకానికి చెందిన వేరుశనక్కాయలు 2 వేల క్వింటాళ్లు కాగా నారాయణికి సంబంధించి 950 క్వింటాళ్లు కేటాయించారు. ఇందులో జనుములు, పిల్లిపెసలు 50 శాతం సబ్సిడీతో ఇవ్వనుండగా వేరుశనక్కాయలను మాత్రం 40 శాతం సబ్సిడీతో రైతులకు అందించనున్నారు. వేరుశనక్కాయలకు త్వరలో రేటు ఖరారు చేయనున్నారు.

ఆర్‌బీకేల్లో పేర్లు నమోదు చేసుకోవాలి



పచ్చిరొట్ట విత్తనాలు, వేరుశనక్కాయలు కావాల్సిన రైతులు ఈనెల 15వ తేదీ నుంచి తమ దగ్గరలోని రైతు భరోసా కేంద్రాలకు వెళ్లి తమ పేర్లను నమోదు చేసుకోవాలి. రైతులు కచ్చితంగా తమ భూమికి సంబంధించిన పాసుపుస్తకం, ఆధార్‌కార్డును తీసుకుని వెళ్లాలి. సబ్సిడీ పోను మిగతా డబ్బులు రైతులు చెల్లించి విత్తనాలు తీసుకోవచ్చు.

– జగదీష్, డీఎం, ఏపీ సీడ్స్

ఎరువులు, విత్తనాలకు ఎలాంటి ఇబ్బందులు ఉండవు



ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి రైతులకు ఎరువులు, విత్తనాలకు ఎలాంటి ఇబ్బంది ఉండదు. ఖరీఫ్ సీజన్‌కు కావాల్సిన ఎరువులు, విత్తనాలకు నివేదికలు పంపాము. ప్రస్తుతం పచ్చిరొట్ట విత్తనాలు, వేరుశనక్కాయలు వచ్చాయి. ఎరువులకు కూడా ఇండెంట్ పంపాము. సీజన్ ప్రారంభం కాగానే విడతల వారీగా వస్తాయి. ప్రస్తుతం జిల్లాలో 16,981 మెట్రిక్ టన్నుల ఎరువులు అందుబాటులో ఉన్నాయి. రైతులు ఎవరు విత్తనాలు, ఎరువులకు ఇబ్బందులు పడాల్సిన అవసరం లేదు.

– అయితా నాగేశ్వరరావు, జిల్లా వ్యవసాయ అధికారి.

బాధ్యతలు స్వీకరించిన 'దిశ' డీఎస్పీ



కడప అర్బన్ : వైఎస్ఆర్ జిల్లా కడప 'దిశ' డీఎస్పీగా ఎస్.రమాకాంత్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఈయన 1991లో ఎస్ఐగా పోలీసు శాఖలో విధుల్లో చేరారు. కడప తాలూకాతో పాటు పలు పోలీస్‌స్టేషన్‌లలో విధులను నిర్వహించారు. 2005లో సీఐగా పదోన్నతి పొందారు. సీఐడీలో, రైల్వేకోడూరులో, ఇతర ప్రాంతాల్లో విధులను నిర్వహించారు. డీఎస్పీగా పదోన్నతి పొందిన తరువాత అనంతపురం జిల్లా ధర్మవరంలో విధులను నిర్వహించారు. ప్రస్తుతం వెయిటింగ్‌లో ఉన్న ఆయన కడప 'దిశ' డీఎస్పీగా నియమితులై బాధ్యతలు చేపట్టారు. అనంతరం జిల్లా ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు.

పకడ్బందీగా పాలిసెట్



చీఫ్ సూపరింటెండెంట్ల సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కో–ఆర్డినేటర్ జ్యోతి

కడప ఎడ్యుకేషన్ : ఈ నెల 10వ తేదీ బుధవారం నిర్వహించనున్న పాలిసెట్‌ను పకడ్బందీగా నిర్వహించేందుకు అన్ని చర్యలను తీసుకున్నామని పాలిసెట్ జిల్లా కో–ఆర్డినేటర్ సీహెచ్ జ్యోతి తెలిపారు. సోమవారం కడప సమీపంలోని ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాలలో పాలిసెట్ ప్రవేశ పరీక్ష నిర్వహణపై చీఫ్ సూపరింటెండెంట్లకు సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా 7879 మంది విద్యార్థులు పాలిసెట్ పరీక్షను రాయనున్నారన్నారు. ఇందుకోసం కడప, ప్రొద్దుటూరులతో కలిపి జిల్లాలో 23 పరీక్షా కేంద్రాలను సిద్ధం చేశామన్నారు.

కేఎస్ఆర్ఎంతో 'మను' ఎంవోయూ



ఎంఓయూ పత్రాలను ఇచ్చిపుచ్చుకుంటున్న దృశ్యం

కడప ఎడ్యుకేషన్ : కడప నగరంలోని మౌలానా ఆజాద్ నేషనల్ ఉర్దూ యూనివర్సిటీ పాలిటెక్నిక్ కళాశాల(మను) మరియు కేఎస్ఆర్ఎం కళాశాలతో ట్రైనింగ్, ప్రాజెక్టు వర్క్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్, ఇన్నోవేటివ్ స్కిల్ డెవలప్‌మెంట్ వంటి అంశాలపై ఎంవోయూ(మెమోరాండమ్ ఆఫ్ అండర్‌స్టాడింగ్) చేసుకున్నారు. సోమవారం కేఎస్ఆర్ఎం కళాశాల కరస్పాండెంట్ కందుల రాజేశ్వరమ్మ, మేనేజింగ్ డైరెక్టర్ కందుల చంద్ర ఓబుల్‌రెడ్డి, ప్రిన్సిపాల్ వీఎస్ఎస్మూర్తితో మను పాలిటెక్నిక్ కళాశాల మెకానికల్ డిపార్టుమెంట్ హెచ్ఓడీ, ప్లేస్‌మెంట్ కోఆర్డినేటర్ హాకీముద్దీన్ ఎంవోయూపై సంతకాలు చేసుకున్నారు.

గృహ నిర్మాణాల్లో వెనుకబడితే చర్యలు



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ విజయరామరాజు

కడప సెవెన్‌రోడ్స్ : పేదల ఇళ్ల నిర్మాణాల్లో పురోగతి కనిపించాలని, అలా కాకపోతే అధికారులపై చర్యలు తప్పవని కలెక్టర్ హెచ్చరించారు. సోమవారం కలెక్టరేట్ సభా భవనంలో నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడారు. జగనన్న కాలనీల్లో పనులు వేగవంతం చేయాలన్నారు. ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో ప్రతిరోజు సమీక్షించాలని చెప్పారు. నిర్దేశించిన పురోగతి చూపాలన్నారు. అధికారులు చేసిన పనులు ఏరోజుకారోజు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. మండల అధికారులు ఆధార్ ఎన్‌రోల్‌మెంట్ తప్పనిసరిగా చేయించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో జేసీ గణేష్‌కుమార్, ట్రైనీ కలెక్టర్ రాహుల్‌మీనా, హౌసింగ్ పీడీ కృష్ణయ్య, డీఆర్వో గంగాధర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

అర్జీదారుల సమస్యలకు నాణ్యమైన పరిష్కారం

స్పందన కార్యక్రమంలో వస్తున్న ఫిర్యాదులకు నాణ్యమైన పరిష్కారం చూపాలని కలెక్టర్ విజయరామరాజు అధికారులను ఆదేశించారు. సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమంలో ప్రజల నుంచి ఆయన ఫిర్యాదులు స్వీకరించారు. క్షేత్ర స్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించి పారదర్శక విచారణ చేసి అర్జీదారుడు సంతృప్తి చెందేలా చూడాలన్నారు. నిర్ణీత గడువులోపు అర్జీలు పరిష్కరించాలని సూచించారు.

సంక్షేమ క్యాలెండర్ విడుదల

రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను నిర్ణీత షెడ్యూల్ ప్రకారం అర్హులకు అందేలా చూడాలని కలెక్టర్ విజయరామరాజు అన్నారు. సమాచార పౌరసంబంధాలశాఖ రూపొందించిన జగనన్న ప్రభుత్వ సంక్షేమ క్యాలెండర్ 2023–24ను సోమవారం సభా భవనంలో కలెక్టర్ ఆవిష్కరించారు. సంక్షేమ పథకాలకు సంబంధించిన వివరాలన్నీ క్యాలెండర్‌లో పొందుపరచడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో జేసీ గణేష్‌కుమార్, ట్రైనీ కలెక్టర్ రాహుల్ మీనా, డీఆర్వో గంగాధర్‌గౌడ్, సమాచార పౌరసంబంధాలశాఖ అధికారి వేణుగోపాల్‌రెడ్డి, హౌసింగ్ పీడీ కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

నేడు డిగ్రీ కళాశాలలు ప్రాజెక్టు రిపోర్టులు సమర్పించాలి

వైవీయూ : యోగివేమన విశ్వవిద్యాలయం పరిధిలోని డిగ్రీ మూడవ సెమిస్టర్‌కు సంబంధించి కమ్యూనిటీ సర్వీస్ ప్రాజెక్టు మార్కులు ఆన్‌లైన్‌లో ఈనెల 9వ తేదీ సాయంత్రం 5గంటలలోపు సమర్పించాలని వైవీయూ పరీక్షల నియంత్రణాధికారి ఆచార్య ఎస్. ఈశ్వరరెడ్డి తెలిపారు. మార్కులు ఆన్‌లైన్‌లో సమర్పించకపోతే సంబంధిత విద్యార్థులు కమ్యూనిటీ సర్వీస్ ప్రాజెక్టుకు గైర్హాజరైనట్లుగా భావించాల్సి వస్తుందన్నారు. ఈనెల పదోతేదీ డిగ్రీ ప్రథమ, తృతీయ సెమిస్టర్ పరీక్షా ఫలితాలను ప్రకటిస్తామన్నారు. ఆ తర్వాత కళాశాలల నుంచి కమ్యూనిటీ ప్రాజెక్టు సర్వీస్ మార్కులను స్వీకరించమని స్పష్టం చేశారు. అంతేకాకుండా ఇక్కడ గైర్హాజరైన విద్యార్థులందరూ వచ్చే యేడాది మళ్లీ కమ్యూనిటీ సర్వీస్ ప్రాజెక్టు పూర్తి చేసి సెమిస్టర్ పాస్ కావాల్సి ఉంటుందన్నారు.

అతివలకు లాభం.. ప్రజలకు సౌకర్యం

- విజయవంతంగా చేయూత మార్ట్
- ఐదు నెలల్లోనే రూ.కోటి పైగా వ్యాపారం
- ప్రజలకు సౌకర్యంగా.. అందుబాటులో ధరలు

మహిళా చేయూత మార్టు అమ్మకాల వివరాలు

నెల	అమ్మకాలు
నవంబర్ 2022	రూ. 2,39,790
డిసెంబర్ 2022	రూ. 16,48,634
జనవరి 2023	రూ. 28,90,009
ఫిబ్రవరి 2023	రూ. 14,59,776
మార్చి 2023	రూ. 18,55,061
ఏప్రిల్ 2023	రూ. 20,90,856
మొత్తం	రూ. 1,01,84,126



ఖాజీపేటలోని మహిళా చేయూత మార్టు



మార్ట్‌లో సరుకులు కొనుగోలు చేస్తున్న మహిళలు

ఖాజీపేట : మహిళలు తలచుకుంటే ఏదైనా సాధిస్తారు .. అందుకు నిదర్శనం ఖాజీపేటలోని మహిళా చేయూత మార్ట్ చెప్పవచ్చు.. నేటి పోటీ వ్యాపారంలో తట్టుకుని అందరికన్నా భిన్నంగా.. ఆలోచిస్తూ తక్కువ ధరకే సరుకులతో పాటు నాణ్యమైన శుభ్రమైన సరుకులు వినియోగదారులకు ఇస్తున్నారు. ఫలితంగా వ్యాపారం బాగా వృద్ధి చెందడంతోపాటు మంచి లాభాలను గడిస్తున్నారు. ఫలితంగా ఇతర మహిళా మార్టులకు ఆదర్శంగా నిలుస్తున్నారు.

జిల్లా వ్యాప్తంగా 15 మహిళా మార్టులను ఏర్పాటు చేయాలని ప్రభుత్వ అధికారులు భావిస్తున్నారు. అందులో భాగంగా ఖాజీపేటను ఎంపిక చేశారు. మహిళా మార్టు ఏర్పాటుకు పెట్టుబడిగా ప్రతి సభ్యురాలు రూ.300 చొప్పున గ్రూపు నుంచి రూ. 3వేలు వసూలు చేశారు. ఇలా మండలంలో 950 గ్రూపులకు గాను రూ. 23లక్షలు పెట్టుబడిగా వచ్చింది. 2022 నవంబర్ 28న ఎమ్మెల్యే రఘురామిరెడ్డి చేతుల మీదుగా మహిళా మార్టును ప్రారంభించారు.

విజయవంతంగా..

ఖాజీపేట లాంటి చోట మహిళామార్టులు విజయవంతంగా నడుస్తాయా అని అందరూ భావించారు. అయితే డ్వాక్రా మహిళల సహకారం.. అధికారుల పర్యవేక్షణతోపాటు మార్కెట్‌లో లభించే ధరలకంటే తక్కువ ధరకు, నాణ్యమైన సరుకులను వినియోగదారులకు అందించేలా సిబ్బంది కృషి చేశారు. ఫలితంగా 5 నెలల్లోనే రూ.కోటికి పైగా వ్యాపారం చేస్తూ విజయవంతంగా మహిళామార్టు నడుస్తోంది.

లాభాలు అన్నీ సభ్యులకే

మహిళా మార్టులో జరిగే వ్యాపారం వల్ల వచ్చే లాభాలు అన్ని మార్టులో పెట్టుబడి పెట్టిన సభ్యులకే. ప్రతి సంవత్సరం వచ్చిన ఆదాయంలో ఖర్చులను తీసి వచ్చిన ఆదాయాన్ని ప్రతి సభ్యురాలికి అందజేస్తామని అధికారులు అంటున్నారు. ప్రతి నెల ఆడిటింగ్ జరుగుతుందని వారు చెబుతున్నారు.

15 మార్టుల ఏర్పాటుకు చర్యలు

జిల్లాలో 15 మార్టులను ఏర్పాటు చేయాలని అధికారులు భావించారు. ఖాజీపేటలో విజయవంతం కావడంతో వేంపల్లి, పోరుమామిళ్ల, బద్వేలులో ప్రారంభించాలని అధికారులు భావిస్తున్నారు.

డ్వాక్రా సభ్యుల సహకారంతో చక్కగా పనిచేస్తోంది



ఖాజీపేట మండలంలోని డ్వాక్రా సభ్యుల సహకారంతో పాటు అందరి కృషి వల్ల చక్కగా మార్టు నడుస్తోంది. అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ, సలహాలు సూచనలు చేయడం వల్ల మంచి ఫలితాలొచ్చాయి.

– శైలజ, ఏపీఎం

నాణ్యమైన వస్తువులు ఇస్తున్నాం



మహిళా మార్టులో బయటితో పోల్చితే ధరలు తక్కువ. నాణ్యత చాలా బాగుంది. అన్ని ఒకే చోట అందుబాటులో ఉండటం వల్ల స్థానికులు కొనుగోలుకు ఆసక్తి చూపుతున్నారు.

– శ్వేత, డ్వాక్రా సభ్యురాలు

సరుకుల నాణ్యత బాగుంది



మార్టులో లభించే సరుకుల నాణ్యత బాగుంది. బయటి ధరల కంటే కొద్దిగా తక్కువగా ఉంది. అందుకే ఇక్కడ కొనేందుకు వచ్చాను.

– శశికళ, కొమ్మలూరు, వినియోగదారురాలు

పెద్ద సంఖ్యలో వినియోగదారులు



మహిళా మార్టుకు ప్రతి రోజు పెద్ద సంఖ్యలో వినియోగదారులు వస్తున్నారు. బయటి ధరలను గమనిస్తూ ఎప్పటికప్పుడు ధరల వ్యత్యాసం లేకుండా చేయడం వల్ల వినియోగదారుల సంఖ్య పెరుగుతోంది.

– సుభాని, మహిళామార్టు సభ్యురాలు

టమాట రైతు కంట కన్నీరు !

పెద్దతిప్పసముద్రం : తంబళ్లపల్లి నియోజకవర్గంలో టమాట పంట సాగు చేసిన రైతులకు కన్నీళ్లే మిగిలాయి. పంట ఆరంభం నుంచి కోత దశ వరకు అష్ట కష్టాలు పడి సాగు చేసినా ఇటు తెగుళ్లు, అటు నిలకడ లేని ధరల కారణంగా పీకల్లోతు అప్పుల్లో కూరుకుపోయారు. నియోజకవర్గంలో సుమారు మూడు వేల హెక్టార్లకు పైగా టమాట పంటను సాగు చేసిన రైతులు మరోసారి ఘోరంగా దెబ్బ తిన్నారు. పంట చేతికి వచ్చే సమయానికి టమాట ధరలు ఒక్కసారిగా పతనం కావడంతో రైతుల పరిస్థితి దయనీయంగా మారింది. ధరలు జూదంలా మారడంతో దిక్కుతోచక పంట కోసం చేసిన అప్పులు ఎలా తీర్చేదని రైతులు కుమిలిపోతున్నారు. మార్కెట్‌లో టమాట ప్రస్తుతం కిలో 10 రూపాయలకు లోపే పలుకుతోంది. కూలీల ఖర్చు, రవాణా చార్జీలకు కూడా అప్పులు చేయాల్సిన దుస్థితి నెలకొందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పలువురు రైతులైతే రవాణా చార్జీలు దండగని భావించి కాయలను కోయకుండా పొలాల్లోనే వదిలేస్తున్నారు. మండలంలో 625 హెక్టార్లలో రైతులు టమాటా పంటను సాగు చేశారు. నాలుగు నెలల క్రితం వరకు టమాటా ధరలు రైతులను ఊరించాయి. అనంతరం ఉసూరుమనిపించాయి. 30 కిలోల టమాటా బాక్సు మార్కెట్‌లో రూ.100ల నుంచి రూ.150ల లోపే పలకడంతో రైతులు మథనపడిపోతున్నారు. నష్టపోయిన రైతులకు ప్రభుత్వం పరిహారం మంజూరు చేయించి ఆదుకోవాలని పలువురు కోరుతున్నారు.



పొలాల్లోనే వదిలేసిన టమాటా

పిడుగుపాటుకు గేదె మృతి

గోపవరం : మండలంలోని బుచ్చనపల్లెలో సోమవారం పిడుగుపాటుకు గేదె మృతిచెందింది. సిద్దవటం వెంకటసుబ్బమ్మకు చెందిన గేదెలు గ్రామానికి సమీపంలోని పొలంలో మేత మేస్తుండగా పిడుగు పడటంతో మేత మేస్తున్న గేదె అక్కడికక్కడే మృతిచెందింది.

వివాహిత ఆత్మహత్య

చింతకొమ్మదిన్నె : మండలంలోని రేడియో స్టేషన్ సమీపంలోగల శివాజీ నగర్‌లో కళాంజలి (22) అనే వివాహిత పుట్టింటిలో చీరతో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. సీకే దిన్నె ఎస్ఐ భూమా అరుణ్‌రెడ్డి కథనం మేరకు... మృతురాలికి మూడు నెలల కిందటే అనంతపురానికి చెందిన వ్యక్తితో వివాహం జరిగినంది. . వివాహిత ఆత్మహత్యకు సంబంధించిన కారణాలు తెలియాల్సి ఉందన్నారు. మృతురాలి తల్లి రాణి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని తెలిపారు.

MYDUKUR MUNICIPALITY

'e' Procurement Tender Notice No. 13 to 18/Potholes/MYDK/AE, (3rd Call) Dt: 08.05.2023, (General Fund)

Estimate Cost 6 No's works Rs. 504000-00 (Potholes)

Bid Document Downloading Start Time	: 09.05.2023 @ 10.00 AM.
Bid document downloading End date	: 16.05.2023 @ 4.00 PM.
Last date / Time of receipt of Tender	: 16.05.2023 @ 5.00 PM.

Contact: Commissioner, Mydukur Municipality - 8008559302
Further details can be seen @ 'e' Procurement market place @ www.'e'procurement.gov.in Assistant Engineer, Contact No. 9494161444 Deputy Executive Engineer, Contact No. 9989539068.

Commissioner, Mydukur Municipality

ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి

ప్రాంతీయ కార్యాలయం, కడప , డి.నెం.1/2277. 2వ అంతస్తు, రాజీవ్ పార్క్ రోడ్డు,
ఏ.పి.హౌసింగ్ బోర్డు కాలనీ, కడప, వైయస్.ఆర్. జిల్లా- 516003, ఈమెయిల్: rokdp-ee1@appcb.gov.in

పర్యావరణ ప్రజాభిప్రాయ సేకరణ ప్రకటన

భారత ప్రభుత్వము, పర్యావరణము, అడవులు & వాతావరణ మార్పు మంత్రిత్వ శాఖ, ప్రకటన నెం.ఎస్.ఓ.1533, తేది: 14.09.2006 మరియు తదుపరి సర్క్యులర్స్‌కు అనుగుణంగా, ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి వారు "ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక మౌలిక సదుపాయాల సంస్థ(ఏపిఐఐసి) వారు వై.యస్.ఆర్ జిల్లా, కొప్పర్తి గ్రామంలో మెగా ఇండస్ట్రీయల్ పార్కు అభివృద్ధి కొరకు ప్రజాభిప్రాయ సేకరణ ప్రకటన జారీ చేయబడినది. సదరు ప్రపోనెంట్ ప్రతిపాదించిన ప్రాజెక్ట్‌కు సంబంధించిన వివరములు క్రింద తెలుపబడినవి.

1. కంపెనీ పేరు, టెలిఫోన్ నెం. మరియు చిరునామా	ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక మౌలిక సదుపాయాల సంస్థ వారి మెగా ఇండస్ట్రీయల్ పార్కు అభివృద్ధి కొరకు, ఏ.పి.ఐ.ఐ.సి. టవర్స్, ఐటి పార్కు, మంగళగిరి, గుంటూరు జిల్లా ఆంధ్రప్రదేశ్ - 522503, ఫోన్: 99480 98209
2. ప్రతిపాదిత ప్రాజెక్టు ప్రదేశం & భూమి విస్తీర్ణం	కొప్పర్తి గ్రామం, చింతకొమ్మదిన్నె మండలం వై.యస్.ఆర్. జిల్లా, ఆంధ్రప్రదేశ్ నందు మెగా ఇండస్ట్రీయల్ పార్కు కొరకు. మొత్తం విస్తీర్ణం 1185.98 ఎకరాలు (479.95 హెక్టార్లు)
3. సంప్రదించవలసిన అధికారి పేరు, చిరునామా మరియు ఫోన్ నెంబరు	శ్రీ కె.శ్రీనివాసమూర్తి, జోనల్ మేనేజర్ (ఇంజనీరింగ్), మెస్సర్స్ ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక మౌలిక సదుపాయాల సంస్థ లిమిటెడ్ (ఏపిఐఐసి), జోనల్ మేనేజర్ వారి కార్యాలయము, ఇండస్ట్రీయల్ ఎస్టేట్, కడప- 516004, వై.యస్.ఆర్.జిల్లా ఆంధ్రప్రదేశ్, ఫోన్:9948098209, ఈమెయిల్ : zm.kad.apiic@nic.in వైయస్ఆర్ జెఎంబిహెచ్ (నార్త్ బ్లాక్), ఏపిఐఐసి, కడప
4. ప్రతిపాదిత ప్రాజెక్టుకు కేటాయించిన పెట్టుబడి	సుమారు రూ.526.73 కోట్లు
5. ప్రతిపాదిత కార్యకలాపాలు	మెగా ఇండస్ట్రీయల్ పార్కు అభివృద్ధి కొరకు
6.ఎన్విరాన్‌మెంటల్ కన్సల్టెంట్లు	వోయాంట్స్ సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్, 403, 4వ అంతస్తు, డిపిటిపి పార్కు సెంట్రా, సెక్టార్ -30, ఎన్‌హెచ్-8, గుర్గావ్- 122001
7. ప్రజాభిప్రాయ సేకరణ తేది, సమయం మరియు ప్రదేశం	తేది : 09.06.2023 సమయం : ఉ.11.00గం॥లకు ప్రదేశం : "ఏపిఐఐసి వారి ప్రతిపాదిత మెగా ఇండస్ట్రీయల్ పార్కు దగ్గర (నార్త్ బ్లాక్), కొప్పర్తి గ్రామం, చింతకొమ్మదిన్నె మండలం, వై.యస్ఆర్.కడప జిల్లా

8. ప్రతిపాదిత ప్రాజెక్ట్‌కు సంబంధించిన వివరములు సదరు ప్రాజెక్ట్ ఎగ్జిక్యూటివ్ సమ్మరీ (తెలుగు & ఇంగ్లీష్) & డ్రాఫ్ట్ EIA/EMP రిపోర్టు ప్రజల సౌకర్యార్థం ఈ క్రింద కార్యాలయములలో లభ్యపరచడమైనది.
i. జిల్లా కలెక్టరు & జిల్లా మేజిస్ట్రేట్ వారి కార్యాలయము, కడప, వై.యస్.ఆర్. జిల్లా .
ii. ముఖ్య కార్యనిర్వహణాధికారి వారి కార్యాలయము, జిల్లా పరిషత్, కడప, వై.యస్.ఆర్. జిల్లా .
iii. జనరల్ మేనేజర్ వారి కార్యాలయము, జిల్లా పరిశ్రమల కేంద్రం,కడప వై.యస్.ఆర్. జిల్లా .
iv. MoEF & CC, GoI వారి కార్యాలయము, ఇంటిగ్రేటెడ్ రీజనల్ ఆఫీస్ (ఐఆర్ఓ.), పర్యావరణ, అటవీ & వాతావరణ మార్పు మంత్రిత్వ శాఖ, భారత ప్రభుత్వం, గ్రీన్‌హౌస్ కాంప్లెక్స్, గోపాలరెడ్డి రోడ్డు, విజయవాడ, ఆంధ్రప్రదేశ్.
v. ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి, క్షేత్రీయ కార్యాలయము, క్రిష్ణా నగర్, కర్నూలు.
vi. ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి, ప్రాంతీయ కార్యాలయము, కడప, వై.యస్.ఆర్.జిల్లా .
vii. తహశీల్దార్ వారి కార్యాలయము, చింతకొమ్మదిన్నె మండలం, వైయస్.ఆర్.జిల్లా
viii. తహశీల్దార్ వారి కార్యాలయము, వల్లూరు మండలం, వైయస్.ఆర్.జిల్లా
ix. తహశీల్దార్ వారి కార్యాలయము, పెండ్లిమర్రి మండలం, వైయస్.ఆర్.జిల్లా
x. గ్రామ పంచాయతీ కార్యాలయం, కొప్పర్తి గ్రామం, చింతకొమ్మదిన్నె మండలం, వైయస్.ఆర్.జిల్లా
xi. పంచాయతీ కార్యదర్శి, గ్రామ పంచాయతీ కార్యాలయం, యాదవాపురం గ్రామం,వల్లూరు మండలం, వైయస్ఆర్ జిల్లా
xii. పంచాయతీ కార్యదర్శి, గ్రామ పంచాయతీ కార్యాలయం, తాడిగొట్ల గ్రామం, చింతకొమ్మదిన్నె మండలం, వైయస్ఆర్ జిల్లా
xiii. గ్రామ పంచాయతీ కార్యాలయం, తోళ్లగంగనపల్లి గ్రామం, వల్లూరు మండలం, వైయస్ఆర్ జిల్లా
xiv. గ్రామ పంచాయతీ కార్యాలయం, అంబవరం గ్రామం, వల్లూరు మండలం, వైయస్ఆర్ జిల్లా
xv. గ్రామ పంచాయతీ కార్యాలయం, రంపతాడు గ్రామం, పెండ్లిమర్రి మండలం, వైయస్ఆర్ జిల్లా

ప్రభావిత ప్రాంతాల ప్రజలు తమ అభిప్రాయాలు, అభ్యంతరాలు ఏవైనా ఉన్నట్లయితే ఈ ప్రకటన ప్రచురించిన 30 రోజులలోగా వ్రాతపూర్వకంగా ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి ప్రాంతీయ అధికారి, కడప, వై.యస్.ఆర్. జిల్లా వారికి పంపవచ్చును. మరియు/లేదా పైన తెలిపిన తేదీన, ప్రదేశమున బహిరంగ ప్రజాభిప్రాయ సేకరణలో పాల్గొని తమ అభిప్రాయాలు, అభ్యంతరాలు తెలుపవచ్చును.

ప్రదేశం : కడప
తేది : 08.05.2023

సం/- ఎన్విరాన్మెంటల్ ఇంజనీర్,
ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి, ప్రాంతీయ కార్యాలయము, కడప, వై.యస్.ఆర్. జిల్లా

లోన్ యాప్ మోసగాళ్లు అరెస్ట్



నిందితుల అరెస్ట్ వివరాలను తెలియజేస్తున్న జిల్లా ఎస్పీ అన్బురాజన్

కడప అర్బన్ : జిల్లాలో లోన్ యాప్ మోసగాళ్లు ఇద్దరిని పోలీసులు అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి రెండు సెల్‌ఫోన్‌లను సీజ్ చేశారు. దాదాపు 70 అనుమానిత బ్యాంక్ ఖాతాలను ఫ్రీజ్ చేశారు. సోమవారం కడపలోని జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ విలేకరులకు వివరాలను వెల్లడించారు. జిల్లాలోని కొత్త మాధవరం గ్రామానికి చెందిన, ఎస్‌పీ టెక్ కేర్ అనే సాఫ్ట్‌వేర్ కంపెనీలో పని చేస్తున్న బండారు కల్పన కుటుంబ అవసరాల నిమిత్తం ఫిబ్రవరి 10న 'లార్జ్ టకా'అనే ఆండ్రాయిడ్ యాప్ ద్వారా ఆన్‌లైన్‌లో తన ఫోన్ నెంబర్, ఆధార్, పాన్‌కార్డు ఆధారంగా రూ. 10 వేలు అప్పు కావాలని దరఖాస్తు చేసుకుని లోన్ తీసుకుంది. సదరు లోన్ తీసుకునేముందు అకౌంట్ వివరాలు యాప్ వాళ్లకు సబ్‌మిట్ చేసింది. తర్వాత వివిధ రకాల లోన్ యాప్ వాళ్లు తనకు కాల్ చేసి మీరు మా యాప్స్‌లో లోన్ తీసుకున్నారని చెప్పడంతో 8 రకాల లోన్ యాప్‌లలో ఫిబ్రవరి 16వ తేదీన పేటీఎం ద్వారా తన అకౌంట్ నుంచి రూ. 24,000 కట్టింది. మళ్లీ 17న ఇంకో ఫోన్ నంబర్ నుంచి కాల్ చేసి రూ.1,76,000 డబ్బులు ఇవ్వాలని, లేకుంటే నీ ఫోటోస్ మార్ఫింగ్ చేసి బంధువులకు, మిత్రులకు పంపుతామనీ బెదిరించారు. డబ్బులు కట్టకపోవడంతో ఫిర్యాది పాన్‌కార్డును మార్ఫ్ చేసి తన ఫోన్ నంబర్ రాసి.. అసభ్య పదాలు రాసి, తన అన్న వాట్సాప్‌కు పంపారు. డబ్బులు పంపకపోతే ఇంకా అసభ్యకరంగా మార్ఫ్‌చేసి ఫొటోలను పెడతామనీ బెదిరింపు కాల్స్ చేస్తూ ఉన్నారు. బాధితురాలు ఒంటిమిట్ట పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి ఫిబ్రవరి 20న ఫిర్యాదు చేయగా క్రైం నెం. 35/2023 కేసుగా నమోదు చేశారు.

70 అనుమానిత బ్యాంకు ఖాతాలు ఫ్రీజ్

ఈ కేసును జిల్లా ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ ప్రతిష్టాత్మకంగా తీసుకుని ఛేదించేందుకు జిల్లా అదనపు ఎస్పీ (అడ్మిన్) తుషార్ డూడీ, కడప డీఎస్పీ ఎం.డి షరీఫ్, ఒంటిమిట్ట సీఐ పురుషోత్తంరాజు, ఎస్ఐ మధుసూదన్‌రావు, సైబర్ క్రైమ్ సీఐ వి. శ్రీధర్‌నాయుడు, ఎస్ఐలు మధుమల్లేశ్వర్ రెడ్డి, పి. రవికుమార్‌తో కలిసి దర్యాప్తు ప్రారంభించారు. ఫిర్యాది లోన్ యాప్‌లకు చెల్లించిన వివిధ యూపీఐ లావాదేవీల ఐడీల ద్వారా దర్యాప్తు చేపట్టారు. ఆయా లింక్‌ల ద్వారా రెండు హెచ్‌డీఎఫ్‌సీ ఖాతాలను గుర్తించారు. ఇప్పటివరకు పై రెండు ఖాతాలకు 2.5 కోట్ల రూపాయలకు పైగా లావాదేవీలు జరుపడంతో పాటు వీటి ద్వారా 70 వేర్వేరు ఖాతాలకు బదిలీ చేసినట్లు తెలుసుకున్నారు. బ్యాంకు ఖాతాల రికార్డుల ప్రకారం మొదటి ఖాతాదారుడు ఉమ్మడి కడప జిల్లాలోని రాజంపేట మండలం, పోలి గ్రామానికి చెందిన పైడి వెంకట ప్రణయ్ స్నేహిత్‌గా, మరొకరు బెంగళూరు రూరల్, దొడ్డబళ్లాపూర్‌కు చెందిన ఎస్.ఇమ్రాన్‌ఖాన్‌గా గుర్తించారు. వారి ఫోన్‌నెంబర్లను తెలుసుకున్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ప్రత్యేక బృందాలుగా ఏర్పాటు చేసి ఇద్దరు నిందితులను టెక్నికల్ అనాలసిస్ విభాగం ద్వారా రాజంపేటలో అరెస్ట్ చేశారు. దాదాపు 70 అనుమానిత బ్యాంక్ ఖాతాలను ఫ్రీజ్ చేశారు. ఈ కేసులో మిగిలిన నిందితులను త్వరలోనే అరెస్ట్ చేస్తామనిఎస్పీ తెలిపారు.

లోన్‌యాప్ బాధితులు 1930 నంబర్‌కు సమాచారం ఇవ్వాలి

డేటాబేస్ ఆధారంగా నిందితులపై తెలంగాణా రాష్ట్రంలో ఒక ఎఫ్ఐఆర్‌లో లోన్‌యాప్ నిందితుల డేటాబేస్, మూడు ఎన్‌సీఆర్‌పీ పిటీషన్‌లు మొత్తం తెలంగాణాలో ఒకటి, ఆంధ్రప్రదేశ్‌లో ఒకటి, కర్ణాటకలో ఒకటి, తమిళనాడులో ఒకటి చొప్పున ఫిర్యాదు చేశారు. రెండు హెచ్‌డీఎఫ్‌సి బ్యాంక్ ఖాతాలను ఫ్రీజ్ చేశారు. రెండు ఖాతాల ద్వారా రూ.2.5 కోట్ల ఆర్థిక లావాదేవీలు జరిగినట్లు గుర్తించారు. ఈ మొత్తంలో 70 బ్యాంక్ ఖాతాలకు సంబంధించి దాదాపు కోటి రూపాయలను ఫ్రీజ్ చేయించారు. లోన్‌యాప్ మోసగాళ్ల సమాచారాన్ని బాధితులు 1930 నెంబర్‌కు ఫోన్ చేసి సమాచారాన్ని అందించాలనీ జిల్లా ఎస్పీ కోరారు.

సీఎంను కలిసిన కరుణ్‌రెడ్డి



సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో కరుణ్‌రెడ్డి, ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి

కమలాపురం : కమలాపురం మండలం కోగటం గ్రామ మాజీ సర్పంచ్, కేఆర్ మీడియా ఎండీ కరుణ్ కుమార్‌రెడ్డి సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని కలిశారు. సోమవారం విజయవాడలోని సీఎం క్యాంప్ కార్యాలయంలో కమలాపురం ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి ఆధ్వర్యంలో మర్యాద పూర్వకంగా కలిశారు. మాజీ ఎమ్మెల్యే వీరశివారెడ్డికి మేనల్లుడైన కరుణ్‌రెడ్డి నివాసానికి ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి ఇటీవల వెళ్లి సంప్రదింపులు జరిపిన విషయం విదితమే. అందులో భాగంగానే సీఎంను కరుణ్‌రెడ్డి కలిశారు. వీరి మధ్య రాజకీయ అంశాలు చర్చకు వచ్చినట్లు తెలిసింది.

జీవీ ఫుట్‌బాల్ కేసులో పురోగతి

కడప అర్బన్ : నకిలీ బెట్టింగ్ యాప్ జీవీ ఫుట్‌బాల్ కేసులో ఇప్పటివరకు 12 మందిని అరెస్ట్ చేసినట్లు కడప డీఎస్పీ ఎం.డి షరీఫ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కేసు విచారణలో 12 బ్యాంకు ఖాతాలు గుర్తించి అందులోని సుమారు రూ.20 లక్షలు ఫ్రీజ్ చేసినట్లు చెప్పారు. బెట్టింగ్ ఆడటం నేరమని, ఎవ్వరూ బెట్టింగ్ యాప్‌ల జోలికి వెళ్లరాదన్నారు. జీ.వి. ఫుట్‌బాల్ బాధితులు ఎవరైనా ఉంటే డయల్ 100కు సమాచారం ఇవ్వాలని సూచించారు.

రైలు కిందపడి గుర్తు తెలియని వ్యక్తి మృతి



కొండాపురం : మండల కేంద్రంలోని రేగడిపల్లె రైల్వేస్టేషన్‌లో హుబ్లీ–తిరుపతి ప్యాసింజర్ రైలు ఎక్కుతూ ప్రమాదవశాత్తు కిందపడి గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందినట్లు ఎర్రగుంట్ల రైల్వే ఎస్ఐ శర్మ తెలిపారు. మృతునికి 40–50 సంవత్సరాల మధ్య వయస్సు ఉంటుందన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రొద్దుటూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఇతనికి సంబంధీకులు తమన సంప్రదించాలన్నారు.

కుమారుడిని కాపాడబోయి..



రామకృష్ణారెడ్డి మృతదేహం

చక్రాయపేట : మండలంలోని చిలేకాంపల్లె గ్రామం రెడ్డివారిపల్లెకుచెందిన రామకృష్ణారెడ్డి (60) కుమారుడినికాపాడబోయి సోమవారం సాయంత్రం విద్యుత్ ప్రమాదానికి గురై మృతి చెందాడు.గాయపడిన కుమారుడు వెంకట సుబ్బారెడ్డిని బంధువులు అతని చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు.గ్రామస్తుల కథనం మేరకు వర్షం వస్తున్న సమయంలో ఇంటి వద్ద విద్యుత్ వైరు కారణంగా వెంకట సుబ్బారెడ్డి విద్యుదాఘతానికి గురయ్యాడు.ఈసంఘటనను చూసిన తండ్రి కుమారుడిని రక్షించబోయి ప్రమాదానికి గురై అక్కడికక్కడే మృతి చెందాడు.ఈవిషయంపై ఎస్సై మల్లికార్జున రెడ్డిని అడుగగా తమకు సమాచారం అందలేదని చెప్పారు.

లారీ ఢీకొని..

దువ్వూరు : మండల కేంద్రమైన దువ్వూరులోని ప్రొద్దుటూరు రహదారిలో సోమవారం లారీ ఢీకొని ఒకరు మృతి చెందినట్లు ఎస్ఐ రాఘవేంద్రారెడ్డి తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. జిల్లేళ్ల గ్రామానికి చెందిన ఉప్పలపాటి శేఖర్ (56) సోమవారం ప్రొద్దుటూరుకు వెళ్లాడు. అక్కడ పనిముగించుకుని మధ్యాహ్నం ద్విచక్ర వాహనంలో బయల్దేరాడు. దువ్వూరు హరిజనవాడ వద్దకు రాగానే ఎదురుగా వస్తున్న లారీ, బైక్‌ను ఢీ కొంది. ఈ ప్రమాదంలో శేఖర్ అక్కడికక్కడే మృతి చెందాడు.

వారంరోజుల్లో పెళ్లి.. అంతలోనే హత్య

- తమ్ముడి చేతిలో అన్న హతం
- చెడు సావాసాలు మానుకోవాలన్నందుకు కత్తితో దాడి



మహమ్మద్ ఇసాక్ (ఫైల్)




రిమ్స్ మార్చురీలో ఇసాక్ మృతదేహాన్ని పరిశీలిస్తున్న కడప టూటౌన్ సీఐ సయ్యద్ హాసం

కడప అర్బన్ : మరో వారం రోజుల్లో ఓ యువకుడు పెళ్లి చేసుకొని కొత్త జీవితంలోకి అడుగుపెట్టబోతున్నాడు. కానీ ఇంతలోపే స్వయానా తన తమ్ముడి చేతిలోనే దారుణంగా హత్యకు గురయ్యాడు.ఈ సంఘటన ఆదివారం అర్ధరాత్రి 12:30 గంటల సమయంలో కడపలో జరిగింది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. కడప టూటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని చిన్నచౌస్తవీధిలో నివాసం ఉంటున్న షేక్ రషీదాభాను, షేక్ దర్బార్ బాషాకు ముగ్గురు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. మూడేళ్ల క్రితం అనారోగ్యంతో దర్బార్ బాషా మృతి చెందాడు. కుమార్తెలు ఇద్దరికి వివాహం చేశారు. ప్రస్తుతం తల్లి, ముగ్గురు కుమారులు కలిసి ఉంటున్నారు. పెద్దకుమారుడు షేక్ మహమ్మద్ ఇలియాస్‌కు కొంతమేరకు మతిస్థిమితం సరిగా లేదు. రెండో కుమారుడు ప్రస్తుతం హత్యకు గురైన షేక్ మహమ్మద్ ఇసాక్(25), మూడో కుమారుడు అన్నను హత్య చేసిన నిందితుడు షేక్ అబుబసర్ అలియాస్ అబ్బు. వీరిలో మహమ్మద్ ఇలియాస్ కడపలో తోపుడు బండిపై దుస్తుల వ్యాపారం చేస్తుంటాడు. షేక్ మహమ్మద్ ఇసాక్ కొన్ని సంవత్సరాల నుంచి మహారాష్ట్రలో పండ్ల వ్యాపారం చేసేవాడు. ఇటీవల తల్లి, బంధువులు పెళ్లి చేసేందుకు కడపకు రప్పించారు. ఈనెల 13, 14 తేదీల్లో వివాహం జరిపేందుకు పెద్దల సమక్షంలో నిశ్చయించారు. ఈలోపే ఈ సంఘటన జరగడంతో తల్లి తల్లడిల్లిపోయింది. ఓ కుమారుడు హత్యకు గురి కావడం, మరో కుమారుడే నిందితుడని తెలియడంతో తల్లి రషీదాభాను కుప్పకూలింది. వెంటనే ఆమెను రిమ్స్‌కు తరలించారు.

హత్యకు దారితీసిన పరిస్థితులు..

షేక్ మహమ్మద్ ఇలియాస్, తన స్నేహితుడు పీరుల్లాఖాన్‌తో కలిసి సర్థాజీపుర వీధిలో కంపచెట్లలో కూర్చుని మద్యం తాగుతున్నారు. ఆ సమయంలో వారిని చూసిన నిందితుడు షేక్ అబూబసర్ అలియాస్ అబ్బు తన రెండో అన్న షేక్ మహమ్మద్ ఇసాక్‌ను అక్కడికి పిలిపించాడు. సంఘటన స్థలానికి వచ్చిన ఇసాక్ అన్నకు మద్దతుగా మాట్లాడాడు.తమ్ముడి చెంపపై కొట్టాడు. దీంతో ముగ్గురి మధ్య వాగ్వాదం జరిగింది.నీవు కూడా చెడుసావాసాలు తిరుగుతున్నట్లు తెలిసిందని, వాటికి దూరంగా ఉండాలని అబ్బును ఇసాక్ హెచ్చరించాడు. ఆగ్రహావేశంతో అబ్బు, తన దగ్గరున్న కత్తితో ఇసాక్‌పై దాడి చేశాడు. శరీరంపై నాలుగు కత్తిపోట్లు పడటంతో ఇసాక్ కుప్పకూలిపోయాడు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. నిందితుడు అబ్బును అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు సమాచారం కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు సీఐ తెలిపారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు మృతి



మాజీ కౌన్సిలర్ సంజీవరాయుడు మృతదేహం



దస్తగిరి మృతదేహం

ప్రొద్దుటూరు క్రైం : ప్రొద్దుటూరు రూరల్ పరిధిలోని వేర్వేరు ప్రాంతాల్లో జరిగిన రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు మృతి చెందారు. వారిలో ఒకరు ప్రొద్దుటూరులోని 28వ వార్డుకు చెందిన మాజీ కౌన్సిలర్ కోటా సంజీవరాయుడు(62) కాగా మరో వ్యక్తి పెద్దశెట్టిపల్లె గ్రామానికి చెందిన చిన్న దస్తగిరి (34). రూరల్ పోలీసులు తెలిపిన మేరకు సంజీవరాయుడుకు రామసుబ్బమ్మ అనే భార్య ఉన్నారు. అతను ఆదివారం రాత్రి రిసెప్షన్ వేడుకలో పాల్గొనేందుకు రామేశ్వరం బైపాస్‌రోడ్డులోని ఓ ఫంక్షన్ హాల్‌కు వెళ్లాడు. భోజనం చేసిన తర్వాత రాత్రి 10.30 సమయంలో నడుచుకుంటూ ఇంటికి బయలుదేరాడు. కొంత దూరం వెళ్లిన తర్వాత కారు ఢీ కొట్టి వెళ్లింది. ఈ సంఘటనలో తీవ్రంగా గాయపడిన అతన్ని స్థానికులు జిల్లా ప్రభుత్వాసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ సోమవారం వేకువ జామున మృతి చెందాడు. మృతుడి సమీప బంధువు కిశోర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ ఎస్ఐ శివప్రసాద్ తెలిపారు.

- మాజీ కౌన్సిలర్ సంజీవరాయుడు మృతి పట్ల ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ బంగారుమునిరెడ్డి సంతాపం తెలిపారు.

ఆగిఉన్న ట్యాంకర్‌ను కారు ఢీకొని..

జమ్మలమడుగు ప్రధాన రహదారిలోని కొత్తపేట సమీపంలో ఆగిఉన్న ట్యాంకర్‌ను ఢీకొన్న ఘటనలో పెద్దశెట్టిపల్లె గ్రామానికి చెందిన దస్తగిరి (34) మృతి చెందాడు. చిన్న దస్తగిరి గ్రామంలోని ప్రధాన రహదారి పక్కన జిరాక్స్ సెంటర్ నిర్వహిస్తున్నాడు. అతనికి భార్య మెహరాజ్, షిఫా అనే కుమార్తె, సాధిక్, సుఫియాన్ అనే ఇద్దరు కుమారులు ఉన్నారు. శంకరాపురం గ్రామానికి చెందిన బాబుల్‌రెడ్డి, దస్తగిరి ఆదివారం రాత్రి ప్రొద్దుటూరుకు వెళ్లారు. రాత్రి పొద్దుపోయిన తర్వాత తిరిగి వస్తున్న సమయంలో పెట్రోల్ బంకు సమీపంలోకి రాగానే వారు ప్రయాణిస్తున్న కారు రోడ్డు పక్కన ఆగివున్న ట్యాంకర్‌ను ఢీ కొంది. ఈ ప్రమాదంలో గాయపడిన ఇద్దరిని ఆస్పత్రికి తీసుకెళ్లారు. దస్తగిరికి తీవ్ర గాయాలు కావడంతో చికిత్స పొందుతూ మృతి చెందాడు. డ్రైవర్ బాబుల్‌రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ ఎస్ఐ శివప్రసాద్ తెలిపారు.

ఫిర్యాదులపై సత్వరం స్పందించాలి

కడప అర్బన్ : జిల్లాలో బాధితులు పోలీసుశాఖకు ఇచ్చే ఫిర్యాదుల పట్ల సత్వరం స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని జిల్లా ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ పోలీసు అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో 'స్పందన' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ బాధితులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు.

నయనమనోహరం..మోహినీరూపం



మోహినీ అలంకారంలో స్వామివారు

జమ్మలమడుగు: పట్టణంలోని నారాపుర వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. సోమవారం స్వామి వారు మోహినీ అలంకారంలో భక్తులకు కనువిందు చేశారు. ఉదయం 8 గంటలనుంచి స్వామి వారికి గ్రామోత్సవాన్ని నిర్వహించారు. అనంతరం స్నపన తిరుమంజనం జరిగింది. రాత్రి స్వామివారు గరుడ వాహనంపై విహరించారు.బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవేంకటేశ్వర స్వామికి కల్యాణోత్సవం జరుగుతుంది.

గ్రంథాలయాలు జ్ఞాన సోపానాలు



మాట్లాడుతున్న లింగాల ఉషారాణి

కడప కల్చరల్ : జిల్లా వ్యాప్తంగా సోమవారం అన్ని ప్రభుత్వ గ్రంథాలయాల్లో విద్యార్థులకు వేసవి శిక్షణ శిబిరాలు ప్రారంభమయ్యాయి. కడపలోని జిల్లా కేంద్ర గ్రంథాలయంలో సోమవారం వేసవి శిక్షణా శిబిరానికి జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్ పర్సన్ లింగాల ఉషారాణి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రంథాలయాలు జ్ఞాన సోపానాలని, విద్యార్థులు తమ ఉజ్వల భవిష్యత్తు కోసం వీటిని ఉపయోగించుకోవాలని సూచించారు. జూన్ 11 వరకు 33 రోజులపాటు ఈ శిబిరాన్ని నిర్వహించనున్నామని ఆమె తెలిపారు. సమగ్ర శిక్ష పథక అధికారి అంబవరం ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ పిల్లలు చదువుతోపాటు సంస్కారం కూడా అలవర్చుకోవాలన్నారు. శిబిరం ప్రధాన రీసోర్స్ పర్సన్, జన విజ్ఞాన వేదిక రాష్ట్ర అధ్యక్షులు రాజశేఖర్ రాహుల్, స్థానిక కార్పొరేటర్ నాగేంద్రప్రసాద్ మాట్లాడారు.

త్వరలో రాచమల్లు రాజన్న భోజనం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి

ప్రొద్దుటూరు : పేద ప్రజల కోసం త్వరలో ఉచితంగా రాచమల్లు రాజన్న భోజనం కార్యక్రమాన్ని ప్రారంభిస్తామని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి తెలిపారు. మున్సిపల్ కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ దాదాపు రెండు వారాల సమయంలోనే ఈ కార్యక్రమాన్ని అమలు చేస్తామన్నారు. ప్రతి రోజు శుచి, రుచితో కూడిన భోజనాన్ని మధ్యాహ్నం 12 నుంచి 2 గంటల వరకు ఏర్పాటు చేస్తామని చెప్పారు. ఏడాదిలో 365 రోజులు ఈ కార్యక్రమాన్ని నిర్వహించాలని నిర్ణయించుకున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. ఇందు కోసం త్రీటౌన్ పోలీస్‌స్టేషన్ సమీపంలోని మున్సిపల్ స్థలాన్ని ఎంపిక చేశామన్నారు. ముందుగా ఈ స్థలాన్ని లీజుకు తీసుకోవాలని అనుకున్నామని, అయితే మున్సిపల్ నిబంధనల ప్రకారం వీలుకాకపోవడంతో స్థలాన్ని ఉచితంగానే తీసుకుంటున్నామన్నారు. మున్సిపల్ అధికారులు ఎప్పుడు ఖాళీ చేయాలంటే అప్పుడు ఖాళీ చేసే విధంగా ఒప్పందం కుదుర్చుకున్నట్లు చెప్పారు. తనకు 15 ఏళ్లు వచ్చే వరకు అన్నం లేక పస్తులతో గడిపానని, రెండు రోజులకో మారు అన్నం దొరికే పరిస్థితి ఉండేది కాదని ఎమ్మెల్యే తెలిపారు. ఆకలి అయినప్పుడే అన్నం విలువ తెలుస్తుందన్నారు. ఎంత మంది వచ్చినా పైసా డబ్బు తీసుకోకుండా ఈ కార్యక్రమాన్ని నిర్వహించాలని పార్టీ కార్యకర్తలు, నాయకులు, శ్రేయోభిలాషులతో కలసి నిర్ణయించినట్లు చెప్పారు.

ఎర్రచందనం దుంగలు స్వాధీనం

వీరేలు : రూ. 9.5 లక్షల విలువైన ఎర్రచందనం దుంగలు, రెండు కార్లు స్వాధీనం చేసుకుని ముగ్గురు నిందితులను అరెస్ట్ చేసినట్లు అన్నమయ్య జిల్లా ఎస్పీ గంగాధరరావు తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. ఎర్రచందనం అక్రమంగా తరలిస్తున్నారన్న ముందస్తు సమాచారంతో మండలంలోని పాంతలచెరువు వద్ద పోలీసులు ప్రత్యేక నిఘా పెట్టారు. ఈ సందర్భంగా ఎర్రచందనం దుంగలతో వచ్చిన రినాల్ట్ డస్టర్ కారు, పైలట్‌గా వచ్చిన మారుతి సుజుకీ బ్రెజ్జా కారును ఆపి పరిశీలించారు. డస్టర్ కారులో 381 కేజీల బరువు గల 13 ఎర్రచందనం దుంగలు స్వాధీనం చేసుకున్నారు. మారుతి సుజుకి కారులో ఉన్న ముగ్గురు నిందితులను అరెస్ట్ చేశారు. పట్టుబడినవారిలో తమిళనాడు రాష్ట్రం వేలూరు జిల్లా కీలకొత్తూరుకు చెందిన ఎ. శరవణన్ అన్నామలై, తిరువణ్ణామలై జిల్లా నమ్మియంపట్టుకు చెందిన శివకుమార్‌పొన్నుస్వామి, ఆర్. దశరథన్ ఉన్నారు.